క్లుప్తంగా

వీరజవాన్ కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

గోరంట్ల: పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన మురళీనాయక్ కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ సోమవారం పరామర్శించారు. కల్లి తండాకు వెళ్లి మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరామనాయక్, జ్యోతిబాయి, వారి కుటుంబ సభ్యులను కలిశారు. వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: 'వీరజవాన్ మురళీనాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం కల్లి తండాకు వస్తున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆయన పర్యటనను విజయవంతం చేయాలి' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కన్వీనర్ వీరనారాయణరెడ్డి అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు గుమ్మయ్యగారిపల్లి క్రాస్‌కు మండలంలోని రైతులు, మహిళలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని చరణ్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ కన్వీనర్ మేదర శంకర, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, ట్రెజరర్ బాలన్నగారిపల్లి రామకృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

పెనుకొండ రూరల్: గోరంట్ల మండలం కోరేవాండ్లపల్లి క్రాస్ సమీపంలో కారులో అక్రమంగా తరలిస్తున్న 24 కేసుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్ తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ దాదాపుగా రూ.1,08,000 ఉంటుందన్నారు. దాడుల్లో సీఐ సృజన్‌బాబు, ఎస్‌ఐలు రాజశేఖర్, రాముడు, సిబ్బంది జనార్దన్, సాల్మన్ రాజు, రమేష్, హరి ప్రసాద్, ఈశ్వర్ పాల్గొన్నారన్నారు.

బియ్యం వేయకుండా ఇబ్బంది పెడుతున్నారు

హిందూపురం: మండలంలోని కగ్గల్లులో స్టోర్ డీలర్ ఆదినారాయణ గ్రామంలో రేషన్ బియ్యం వేయకుండా టీడీపీ నాయకులు అడ్డంకులు సృష్టిస్తున్నారని సోమవారం పుట్టపర్తిలో కలెక్టర్, ఆర్డీఓ, రెవెన్యూ అధికారులకు గ్రీవెన్స్‌లో వినతిపత్రాలు సమర్పించారు. వికలాంగుడైన తన ఎఫ్‌పీ షాపును ఎలాగైనా రద్దు చేయించేందుకు స్థానిక టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. బియ్యం పంపిణీకి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

దిగుబడి ఘనం.. ధర పతనం

ఉల్లి రైతులు నష్టాల బాట పట్టారు. దిగుబడి బాగున్నా... ధర పతనం కావడంతో పెట్టిన పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించినా ఫలితం లేదని కన్నీరు మున్నీరవుతున్నారు.



ఉల్లికాడలు తొలగిస్తున్న మహిళా కూలీలు

- నష్టాలబాటలో ఉల్లి రైతులు
- గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు
- పెట్టుబడి కూడా దక్కడంలేదని ఆవేదన



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేసిన ఉల్లి బస్తాలు

అమరాపురం : మండలంలోని తమ్మడేపల్లి, గౌడనకుంట, నగోనపల్లి, అమరాపురం, మద్దనకుంట, వీరాపురం, హలుకూరు, చిట్నడకు, కాచికుంట, హేమావతి, ఉదుగూరు తదితర గ్రామాల్లో 33.85 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఉల్లి విత్తనాలు, మందులు, కలుపు మొక్కలు తొలగించడం తదితర వాటిని చేపట్టారు. పంట బాగా వచ్చింది. దిగుబడి వచ్చినా ప్రస్తుతం మార్కెట్లో ధరలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బోరుబావుల కింద సాగు

వివిధ గ్రామాల్లో రైతులు బోరు బావుల కింద రబీలో ఉల్లి సాగు చేశారు. గత ఖరీఫ్‌లో ఉల్లి పంటకు ధరలు బాగా రావడంతో రైతులు ఉల్లి సాగు చేస్తే కొంతమేర ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చన్న భరోసాతో రబీలో ఉల్లిని వేశారు. కొంతమంది రైతులు ఉల్లి పైరు నుంచి వేరు చేసిన బస్తాలను ఇంటి ఆవరణలో, కల్లాలో నిలువ చేశారు. ధర వచ్చినప్పుడు అమ్ముకోవాలని భావిస్తున్నారు. అయితే ఇప్పుడున్నా ధరకు అమ్మితే పెట్టుబడి కూడా రాదని వాపోతున్నారు.

రైతులను ఆదుకోని ప్రభుత్వం

ప్రస్తుత కూటమి ప్రభుత్వం నష్టపోయిన ఉల్లి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని రైతులు, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గిట్టుబాటు ధర కల్పించి ఉల్లి కొనుగోలు చేస్తే కొంతమేర రైతులకు ఉపశమనం కలుగుతుందంటున్నారు. అయితే ప్రభుత్వం అలాంటి చర్యలకు దిగకపోవడం బాధాకరమని చెబుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులకు ఎలాంటి సహాయం చేయడం లేదు. కనీసం పెట్టుబడి సహాయం కూడా ఇంత వరకూ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వలేదు.

ఉల్లితో తీవ్రంగా నష్టపోయా



మాది ఉమ్మడి కుటుంబం. మాకున్న పొలంలో బోరు బావి కింద రెండెకరాలలో గత డిసెంబర్‌లో ఉల్లి సాగు చేశాను. పంట బాగా వచ్చింది. ఇందుకోసం రూ.80 వేలు ఖర్చు చేశాను. వంద బస్తాల ఉల్లి చేతికొచ్చింది. ప్రస్తుతం మార్కెట్లో ధర లేదు. ఒక్క బస్తా రూ.500 అడుగుతున్నారు. ఈ రేటుతో అమ్మితే రూ.50 వేలు వస్తోంది. రూ.30 వేలు నష్టం వస్తుంది. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు.

– దేవరాజు, తమ్మడేపల్లి, అమరాపురం మండలం

గిట్టుబాటు ధర కల్పించాలి



గత ఖరీఫ్‌లో ఉల్లి ధరలు ఆకాశాన్ని అంటాయి. దీంతో నేను ఉల్లిని రబీలో సాగు చేశా. పంట చేతికి వచ్చింది. అయితే ధరలు లేవు. ఉన్నకాటికి అమ్ముకోవాలి. లేదంటే మొదటికే మోసం చేస్తుంది. ఎందుకంటే వర్షం వస్తే ఉల్లి గడ్డలు పాడై పోతాయి. ప్రభుత్వం ఉల్లిని రైతుల వద్ద కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలి.

– గంగాధరప్ప, హలుకూరు, అమరాపురం మండలం

పెట్టుబడి కూడా దక్కలేదు



నాకున్న పొలంలో బోరుబావి కింద ఎకరా ఉల్లి సాగు చేశాను. పంట పెరికి ఉల్లిని శుభ్రం చేయడానికి రూ.40 వేలు ఖర్చు వచ్చింది. పంటను అమ్మేయగా చేతికి రూ.30 వేలు వచ్చింది. రూ.10 వేలు నష్టం వచ్చింది. అంతేకాదు ఇంటిలో వారు చేసిన కష్టానికి కూడా ప్రతి ఫలం దక్కలేదు.

– ఈరలింపగ్ప, తమ్మడేపల్లి, అమరాపురం మండలం

మురళీ నాయక్‌కు ఘన నివాళి

గుడిబండ: యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు సోమవారం స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ కరుణాకర్‌గౌడు, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు ఆధ్వర్యంలో జవాన్ మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు శశిధర్, దళిత నాయకులు నరసింహప్ప, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ డీఐ పోస్టులను భర్తీ చేయాలి

గోరంట్ల: రాష్ట్రంలోని 11 జిల్లాల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ డీఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఉర్దూ రేంజ్) పోస్టులను ప్రభుత్వం అర్హులైన వారితో వెంటనే భర్తీ చేయాలని ఉర్దూ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్‌ముష్తాక్ డిమాండ్ చేశారు. ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణకు విద్యా అభివృద్ధితో పాటు ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా డీఐలు ఎంతగానో ఉపయోగపడతారన్నారు.

మున్సిపల్ వైస్ ఛైర్మన్‌కు సన్మానం



జబీవుల్లాను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: మున్సిపల్ వైస్ ఛైర్మన్ జబీవుల్లాను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఘనంగా సత్కరించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. సోమవారం మున్సిపల్ వైస్ ఛైర్మన్ పదవిని టీడీపీ అవిశ్వాసం పెట్టి అక్రమంగా దక్కించుకోవాలని చూసి విఫలమైంది. తిరిగి జబీవుల్లానే మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన్ను సత్కరించారు. వేణురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జగన్ పర్యటన విజయవంతం చేయండి

చిలమత్తూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వీరజవాన్ మురళీనాయక్ కుటుంబ పరామర్శకు వస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రాష్ట్ర సరిహద్దులోని బాగేపల్లి టోల్‌ప్లాజా వద్దకు ఉదయం 9.30 గంటలకు చేరుకోవాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక సూచించారు. ఉదయం 8 గంటలకు పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద అల్పాహారం ఏర్పాటు చేశామని, అక్కడి నుంచి తరలివెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

తూనికలు, కొలతలపై అవగాహన

హిందూపురం టౌన్: వ్యాపారులు, వినియోగదారులు తూనికలు, కొలతలపై అవగాహన పెంచుకోవాలని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. ప్రపంచ తూనికలు కొలతల శాఖ దినోత్సవ సందర్భంగా వారోత్సవాల్లో భాగంగా సోమవారం వ్యాపారులకు పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

పేదల స్థలాలు కాపాడండి

హిందూపురం: మండలంలోని కిరికెర పొలం సర్వే నంబర్ 65–2బీ2లో పేద ఎరుకలకు ఇచ్చిన పట్టా స్థలాలను చదును చేసి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రాన్ని సమర్పించారు. 2012 మహానేత వైఎస్సార్ ప్రభుత్వం ఇచ్చిన భూమిలో అక్రమార్కులు రాళ్లు తొలగించి స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా కేశవరెడ్డి బాధ్యతలు



గుడిబండ: ఎంపీడీఓగా కేశవరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఓడీ చెరువులో డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. కేశవరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

వైద్యాధికారిణిగా అయేషా తస్మిన్



సోమందేపల్లి: మండల వైద్యాధికారిణిగా సీఎం అయేషా తస్మిన్ సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. హెల్త్ సూపర్ వైజర్లు రవీంద్ర, రత్నమ్మ సిబ్బంది స్వాగతం పలికారు. రోగులకు మెరుగైన సేవలు అందిస్తామని అయేషా తస్మిన్ తెలిపారు.

వివిధ సమస్యలపై ఆరు అర్జీలు

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారానికి ఆరు ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పావగడ: పట్టణంలోని బళ్లారి రోడ్డులోని కోర్టు కాంప్లెక్స్ నుంచి చళ్లకెరె క్రాస్ వరకూ కాలిపోయిన 11కేవీ ఏబీసీ కేబుల్‌ను మారుస్తున్నట్లు బెస్కాం ఏఈఈ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 66–11 కేవీ పావగడ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేసే ఎఫ్–1 పావగడ ఫీడర్‌లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఆర్టీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలి

మడకశిరరూరల్: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయాలని కోరుతూ సోమవారం సేవ్ ఆర్డీటీ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్‌కు అర్జీని అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రజాంఘాల జేఏసీ, ముస్లిం ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

టైర్ పగిలి బొలెరో వాహనం బోల్తా



అగళి: మండలంలోని రామనపల్లి సమీపంలోని హైవేపైన సోమవారం అరటి పండ్ల లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం టైర్ పగిలిపోవడంతో బోల్తా పడింది. పులివెందుల నుంచి కర్ణాటక రాష్ట్రం టిప్టూరుకు అరటి కాయల లోడుతో వెళ్తున్నట్లు స్థానికులు తెలిపారు. అయితే వాహనంలో ఉన్న డ్రైవర్ ఆదితో పాటు సహాయకుడికి ఎలాంటి గాయాలు కాలేదు. అరటికాయలన్నీ రోడ్డుపై పడిపోయాయి.

నరేగా కూలీలపై దౌర్జన్యం

పావగడ: తాలూకాలోని కోటగుడ్డ గ్రామం చళ్లకెరె రోడ్డు సమీపంలోని అక్కమ్మ గార్ల చెరువు పూడిక తీత పనులను జేసీబీ యంత్రంతో నిర్వహిస్తుండగా కొందరు నరేగా కూలీలు జేసీబీ యంత్రాన్ని సోమవారం అడ్డుకున్నారు. దీంతో జేసీబీ యజమాని, అతని మద్దతుదారులు కూలీలపై దౌర్జన్యం చేశారు. రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఘటనపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నరేగా కూలీల సంఘం నాయకుడు ఓబుళ నరసింహ తెలిపారు.

గదుల బాడుగకు టెండర్ల ఆహ్వానం

హిందూపురం టౌన్: పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఉన్న పెద్ద గది, చిన్న గదిని టెండర్ ద్వారా బాడుగకు ఇవ్వడానికి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న తెలిపారు. పెద్దగదిని నెలకు రూ.35 వేలకు, చిన్న గదిని రూ.18 వేలకు నెల బాడుగ రూపంలో రెండు సంవత్సరాల కాలపరిమితికి టెండర్ల ద్వారా కేటాయిస్తామన్నారు. ఈ నెల 17న మధ్యాహ్నం 1 గంటకు టెండర్ మూసేస్తామని, వెంటనే అదే రోజు 3 గంటలకు టెండర్లు తెరుస్తామని చెప్పారు.

చెక్కుల పంపిణీ

పావగడ: పాడి ఆవుల బీమా చెక్కులను స్థానిక ఎమ్మెల్యే, తుముల్ అధ్యక్షుడు హెచ్‌వీ వెంకటేశ్ 14 మంది పాడి రైతులకు సోమవారం అందించారు. అలాగే ఓబుళాపురంలో నూతనంగా నిర్మించిన డెయిరీ భవన నిర్మాణం బిల్లు రూ.5 లక్షలను సంబంధిత డెయిరీ నిర్వాహకులకు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తుముల్ డైరెక్టర్ బెళ్లిబట్లు చంద్రశేఖర రెడ్డి, మున్సిపల్ మాజీ అధ్యక్షుడు పీహెచ్ రాజేశ్, కౌన్సిలర్ టెంకాయల రవి , అధికారిణి సునీత తదితరులు ఉన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	35.0
పెనుకొండ	39.0
మడకశిర	35.0

యానిమేటర్‌పై చర్యలు తీసుకోండి

సోమందేపల్లి: మండలంలో రూకలపల్లికి చెందిన వెలుగుశాఖకు చెందిన యానిమేటర్ మౌనిక విధులు నిర్వహించకుండా ఆమె భర్త సంజీవరాయుడుతో పనిచేస్తున్నారని సర్పంచ్ కిష్టప్పతో పాటు గ్రామస్తులు ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మకు సోమవారం ఫిర్యాదు చేశారు. తమను అనేక రకాలుగా సంజీవరాయుడు ఇబ్బందులు పెడుతున్నాడని డ్వాక్రా సంఘం సభ్యులు సుగుణ, రాధిక, రామాంజినమ్మ తెలిపారు. సీసీ అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని, వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నల్లగొండ్రాయనపల్లి క్రాస్ వద్ద సర్వే నంబరు 700లో పేదలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను దౌర్జన్యంగా తొలగించిన ఇన్‌చార్జ్ కార్యదర్శి రామాంజినేయులుపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వారు ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. రాజ్‌గోపాల్, చాంద్‌బాషా, నారాయణస్వామి, సూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని తహసీల్దార్ లక్ష్మీ నరసింహా సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశమై పలు సూచనలు చేశారు.

జూదరుల అరెస్ట్



జూదరులను చూపుతున్న పోలీసులు

గుడిబండ: మండలంలోని సీసీ గిరి గ్రామ శివారులో సోమవారం సాయంత్రం పేకాట ఆడుతూ పలువురు పోలీసులకు పట్టుబడ్డారు. అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుంటుండగా పేకాటరాయుళ్లు గుర్తించి పారిపోయారు. ఆ సమయంలో కానిస్టేబుల్లు వెంటాడి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు తప్పించుకున్నారు. రూ.1.28 లక్షల నగదు, 10 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని జూదరులపై కేసు నమోదు చేసినట్లు మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

పరేషాన్



రేషన్ షాపు వద్ద గుమిగూడిన లబ్ధిదారులు

రొద్దం: మండల కేంద్రంలోని శ్రీసాయి ప్రైవేటు స్కూల్ ముందు రేషన్ షాపు వద్ద బియ్యం కోసం లబ్ధిదారులు ఎగబడ్డారు. సోమవారం ఉదయం నుంచి రేషన్ కార్డులు పట్టుకుని క్యూలో నిలబడ్డారు. సాంకేతిక లోపం వల్ల బియ్యం పంపిణీ ఆలస్యం కావడంతో లబ్ధిదారులు ఎండకు ఇబ్బందులు పడ్డారు.

ఆధ్యాత్మిక శోభ

- పలుచోట్ల రథోత్సవాలు, జ్యోతుల ఉత్సవం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



హిందూపురం: అలంకరణలో పెద్దమ్మ



మడకశిర: లక్ష్మీ వేంకటరమణస్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



హిందూపురం: ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగింపుగా తెస్తున్న భక్తులు



రొళ్ల మండలం కాల్వేపల్లిలో రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



గుడిబండ: పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

హిందూపురం: మండలంలోని సంతేబిదనూర్‌లో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ ఆంజనేయస్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి రథంలోకి తీసుకువచ్చారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనం మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్‌నిశ్చల్, సర్పంచ్ లలిత, మండల కన్వీనర్ రాము తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

పెద్దమ్మ జాతర

పట్టణంలో బాపూజీనగర్‌లో వెలసిన పెద్దమ్మ జాతర మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా.. మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రొళ్ల: మండల పరిధిలోని కాల్వేపల్లిలో వెలసిన లక్ష్మీరంగనాథస్వామి ఉత్సవ విగ్రహాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు, కైవాడస్తులు, గ్రామ పెద్దలు ఘనంగా ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

మడకశిరరూరల్: మండలంలోని ఛత్రం పంచాయతీలో వెలసిన ఈరమాళమ్మకు సోమవారం కుంచిటి వక్కలిగ కులస్తులు భక్తిశ్రద్ధలతో జలధి ఉత్సవం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించి పూజలు నిర్వహించారు.

గుడిబండ: మండల పరిధిలోని హెచ్‌ఆర్ హట్టిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామ దేవత గౌడచంద్ర మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠను సోమవారం ఘనంగా నిర్వహించారు. హోమాలు, వివిధ రకాల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి, అమ్మవారి విగ్రహాన్ని అభిషేకించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పలువురు నాయకులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ రూ.50 వేలు, సర్పంచులు సతీష్ రూ.25 వేలు, కరుణాకర్‌గౌడు రూ.25 వేలు ఆలయాభివృద్ధికి అందించారు.

మడకశిరరూరల్: పట్టణంలోని లక్ష్మీవేంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు బ్రహ్మ రథోత్సవంలో పాల్గొన్నారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ వై తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి దంపతులు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. ప్రభుత్వం తరుపున తహసీల్దార్ కరుణాకర్ శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

అమరాపురం: మండలంలోని నడలూడంలో నాలుగు రోజులుగా నిర్వహించిన ఆంజనేయస్వామి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. నూతన ఆలయ ప్రవేశం, స్వామి వారి విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన, హారతులు, 101 ఎడలు తదితర పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో వలస సర్పంచ్ నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

పెనుకొండ రూరల్: తాగు నీటి సమస్యకు పరిష్కారించాలని స్థానిక జగనన్న కాలనీ వాసులు ఆర్డీఓ కార్యలయంలో ఏఓ గిరిధర్ నాయక్‌కు సోమవారం వినతిపత్రమిచ్చారు. నీళ్ల రాక ప్రైవేటుగా ట్యాంకులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు.

యువతి అదృశ్యం

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి (18) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. విజయవాడలో చదువుతున్న యువతి సెలవులు కావడంతో గ్రామానికి వచ్చిందన్నారు. అయితే సోమవారం తెల్లవారుజామునుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.